క్లుప్తంగా

దివ్వెలకు సత్కారం



సత్తెనపల్లి: భరతమాత అన్నప్రసాద వితరణ పథకంను ప్రారంభించి దాతల సహాయ సహకారంతో 713 రోజులు పూర్తి చేసిన సందర్భంగా పథకం బాధ్యుడు దివ్వెల శ్రీనివాసరావు సేవలను పలువురు కొనియాడారు. పట్టణంలోని వాసవీకన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ కల్యాణ మండలంలో ఆర్యవైశ్య సేవా సమితి అధ్యక్షుడు వెలుగూరి శరత్‌బాబు ఆధ్వర్యంలో సోమవారం దివ్వెల శ్రీనివాసరావును పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



ఊటుకూరు(క్రోసూరు): మండలంలోని ఊటుకూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం సైబర్ నేరాలపై విద్యార్థులకు గుడ్ షెపర్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి తండు లక్ష్మణ్ అధ్యక్షత వహించారు. గుడ్ షెఫర్డ్ సంస్థ కో ఆర్డినేటర్ సిస్టర్ యాంటో మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాలకు దూరంగా ఉండి చదువుకు దగ్గరగా ఉండాలన్నారు. సంస్థ సిబ్బంది నూతక్కి దిలీప్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. అవసరమైన మేరకే ఇంటర్నెట్‌ను వినియోగించుకోవాలన్నారు. అవసరం లేని లింకులను ఓపెన్ చేయకూడదన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ నాగశౌరీలు, ప్రధానోపాధ్యాయుడు నాగమల్లేశ్వరరావు, సైదా నాయక్ సంస్థ సిబ్బంది బాబు, పవన్, మరియమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

హసనాబాద్‌లో చోరీ



క్రోసూరు: మండలంలోని హసనాబాద్ గ్రామంలో ఆదివారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్ఐ పి.రవిబాబు సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన షేక్ ఘనసైదా ఆదివారం ఉదయం గుంటూరు వెళ్లి రాత్రి ఇంటికి వచ్చారు. అప్పటికే ఇంటి తలుపు తీసి బీరువాలోని 65 గ్రాముల బంగారు ఆభరణాలు,20 తులాల వెండి వస్తువులు దొంగతనం జరిగినట్లు గుర్తించారు. ఆ మేరకు పోలీసు స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఘటన జరిగిన ఇంటిని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు. క్లూస్ టీంను రప్పించి వేలిముద్రల సేకరణ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా డాగ్ స్క్వాడ్‌ను తెప్పించనున్నట్లు ఎస్ఐ వివరించారు.

కార్మిక వర్గాల సమ్మెను జయప్రదం చేయాలి



అమరావతి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ, కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాల్ని నిరసిస్తూ ఈ నెల 9న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న కార్మిక సంఘాల సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి బి.సూరిబాబు పిలుపునిచ్చారు. సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి శివరాంకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు సాధించుకున్న 44 కార్మిక చట్టాల్ని నాలుగు కోడ్‌లుగా విభజన చేసి కార్పొరేట్లకు అనుకూలమైన చట్టాల్ని తీసుకురావటాన్ని నిరసిస్తూ, ఉద్యోగులకు వేతనాలు పెంచాలని, స్కీం వర్కర్లకు పథకాలు వర్తింపజేయాలని.. ఇలా పలు డిమాండ్‌లతో సమ్మె చేస్తున్నామన్నారు. ఈ నెల 9వ తేదీ ఉదయం 9 గంటలకు అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, వీఆర్ఏలు, అన్ని రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకోవాలని సూరిబాబు కోరారు. సీపీఎం నాయకుడు సయ్యద్ మొహిద్దీన్, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు నివాళి

క్రోసూరు: ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్వర్గీయ జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. క్రోసూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్దనున్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన ఆంధ్రప్రదేశ్ ఎస్సీ ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర హానరబుల్ చైర్మన్ గార్లపాటి దాసు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ పేద కుటుంబంలో జన్మించి సమాజంలో అణగారిన కులాల హక్కుల కోసం కృషి చేసిన సంఘసంస్కర్త అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చిలకా భాస్కరరావు, ఎంపీటీసీ చిలక రవికుమార్. మేదర రోశయ్య. కిన్నెర వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అన్నీ సమస్యలే...

- వసతుల కొరతతో కొట్టుమిట్టాడుతున్న ప్రాంతీయ పశు వైద్యశాల
- ప్రహరీ, కనీసం నీటి వసతి లేని వైనం
- రాత్రి సమయంలో సాగుతున్న అసాంఘిక కార్యకలాపాలు



నకరికల్లులోని ప్రాంతీయ పశు వైద్యశాల

నకరికల్లు: స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాల సమస్యల వలయంలో కొనసాగుతుంది. నకరికల్లు, రొంపిచర్ల రెండు మండలాల పశు వైద్యశాలలు, సబ్‌సెంటర్‌లు అనుసంధానంగా నకరికల్లులోని ప్రాంతీయ పశు వైద్యశాల కార్యకలాపాలు సాగుతుంటాయి. వైద్యశాల చుట్టూ ప్రహరీ, మరుగుదొడ్లు లేక, కనీసం నీటి సౌకర్యం కూడా లేక అవస్థలు పడుతున్నారు. పశువులను పరీక్షించే ట్రెవీస్ కూడా తుప్పు పట్టి శిథిలావస్థకు చేరుకుంది. ప్రహరీ లేకపోవడంతో ప్రైవేటు వాహనాలు పార్కింగ్ చేస్తూ అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారింది.

రెండు మండలాలకు అనుసంధానంగా...

నకరికల్లులోని ప్రాంతీయ పశు వైద్యశాల నకరికల్లు, రొంపిచర్ల మండలాల రైతులకు అనుసంధానంగా పనిచేస్తుంది. నకరికల్లు మండలంలోని దేచవరం, రొంపిచర్ల మండలంలోని సంతగుడిపాడు, కర్లకుంట, రొంపిచర్ల గ్రామాల్లోని పశు వైద్యశాలలు, చల్లగుండ్ల, చేజర్ల, కండ్లకుంట, కుంకలగుంట, రూపెనగుంట్ల, విప్పర్ల రెడ్డిపాలెం, అన్నవరం, గోగులపాడు గ్రామాల్లోని సబ్‌సెంటర్‌లు పని చేస్తాయి. సచివాలయ సిబ్బంది 11 మంది, గోపాలమిత్రలు 11 మంది, వైద్యశాలల సిబ్బంది 15 మందికి పైగా పనిచేస్తున్నారు. వారిలో 11 మంది మహిళా సిబ్బంది కూడా ఉన్నారు. వీరందరూ సమావేశాలకు, ట్రెనింగ్‌లకు, మందులకు నకరికల్లు ప్రాంతీయ పశు వైద్యశాలకు వచ్చి వెళ్తుంటారు.

వైద్యశాలలో వసతుల కొరత

నకరికల్లులోని ప్రాంతీయ పశు వైద్యశాల వసతుల కొరతతో కొట్టుమిట్టాడుతుంది. వైద్యశాలకు ప్రహరీ లేకపోవడంతో ప్రైవేటు వాహనాలన్నీ ప్రాంగణంలోనే పార్కింగ్ చేస్తున్నారు. రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారింది. మూగజీవాలు, పాడిగేదెలను పరీక్షించేందుకు ఏర్పాటు చేసిన ట్రెవీస్ తుప్పు పట్టి శిథిలావస్థకు చేరింది. గేదెలను పరీక్షించిన అనంతరం చేతులు శుభ్రం చేసుకునేందుకు కనీసం నీటి వసతి కూడా లేదు. రెండు మండలాల స్థాయి వైద్యశాలకు కనీసం బోరు కూడా లేక నీటికి ఇక్కట్లు ఏర్పడ్డాయి. చేతులు శుభ్రం చేసుకునేందుకు కూడా సమీప గృహాల వారిని అడిగి బకెట్లతో నీళ్లు మోసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వాటర్‌ట్యాంకు సౌకర్యం కూడా లేక తాగునీరు కూడా బయటి నుంచి తెచ్చుకుంటున్నారు. కనీసం మరుగుదొడ్డి వసతి కూడా లేకపోవడంతో ఇతర వైద్యశాలల నుంచి ఇక్కడకు వచ్చే మహిళా వైద్య సిబ్బంది, మహిళా రైతులు అవస్థలు పడుతున్నారు. రైతులకు పంపిణీ చేసే మందులు, పశువుల దాణా, గడ్డి విత్తనాలు నిల్వ చేసుకునేందుకు స్టోర్‌రూం లేక ఉన్న గదుల్లోనే సర్దుబాటు చేసుకుంటున్నారు. మైక్రోస్కోప్ లాంటి పరికరాలు పెట్టుకునేందుకు ఫర్నిచర్ సౌకర్యం లేక తాత్కాలిక ఏర్పాట్లు చేసుకొని నెట్టుకొస్తున్నారు. ఉన్నత శాఖ అధికారులు స్పందించి ప్రాంతీయ పశు వైద్యశాలకు వసతులు కల్పించాలని పాడి రైతులు కోరుతున్నారు.

> **నివేదిక పంపాం**
>
> 
>
> నకరికల్లు ప్రాంతీయ పశు వైద్యశాల ఏడీఏగా ఇటీవలే బాధ్యతలు పూర్తి స్థాయిలో తీసుకున్నాను. వైద్యశాలలోని వసతుల కొరతపై స్థానిక ఎమ్మెల్యేకు, ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. అనుమతుల కోసం ఎదురు చూస్తున్నాం. అనుమతులు రాగానే మరమ్మతులు, మౌలిక వసతులు కల్పించాలని భావిస్తున్నాం.
>
> – డాక్టర్ వెంకటేశ్వర్లు నాయక్, ఏడీఏ, పశు వైద్యశాల, నకరికల్లు

అక్రమ మైనింగ్‌పై నిఘా పెట్టాలి



తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.అరుణ్‌కుమార్

నకరికల్లు: అక్రమ మైనింగ్‌ను అరికట్టేందుకు గట్టి నిఘా ఏర్పాటు చేయాలని కలెక్టర్ పి.అరుణ్ కుమార్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. పలు కీలక అంశాలపై మైనింగ్, రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ మైనింగ్‌పై ఫిర్యాదులు వస్తున్నాయని అరికట్టేందుకు పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రీ ఓపెన్ అయిన అర్జీలు, మ్యుటేషన్‌లు, రీసర్వే, ఇళ్లపట్టాల అర్జీలు, ఇళ్ల నిర్మాణ రెగ్యులరైజేషన్, గ్రావెల్ తవ్వకాలపై దృష్టి సారించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధికారులందరూ హాజరు కావాలన్నారు. సమస్యలు లేని ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి రెగ్యులరైజేషన్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, ఆర్డీఓ రమణాకాంత్‌రెడ్డి, జిల్లా మైన్స్ అండ్ జియాలజీ అధికారి నాగిని, సర్వే ఏడీ భానుకీర్తి, తహసీల్దార్ కె.పుల్లారావు, డిప్యూటీ తహసీల్దార్ కొండారెడ్డి, ఆర్ఐ సిద్దయ్య, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు



దొడ్లేరులోని మొహర్రం వేడుకలలో భక్తులు

దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని పలు గ్రామాల్లో మొహర్రం పండుగను భక్తులు భక్తిశ్రద్ధలతో సోమవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని దొడ్లేరు గ్రామంలో ముజావర్లు రెండు చావిళ్లలో ఏర్పాటు చేసిన పీర్లను బయటకు తీసి స్నానాలు ఆచరించి గ్రామోత్సం నిర్వహించారు. అషురా సందర్భంగా నిప్పుల గుండాల మీదగా భక్తులు పీర్లను తీసుకుని నడిచి తమ భక్తిని చాటుకున్నారు. మహమ్మద్ ప్రవక్త మనవడు ఇమామ్ హుస్సేన్ ఇరాన్ దేశంలోని కర్బల మైదానంలో అల్లా వ్యతిరేక శక్తులతో పోరాడుతూ అసువులు బాసిన సందర్భంగా షియా ముస్లింలు పది రోజులు సంతాప దినాలు పాటిస్తూ మొహర్రం నిర్వహిస్తారు. అందులో భాగంగా కొంత మంది ఉపవాసాలు ఉంటూ పీర్లను తీసుకుని అగ్నిగుండంపై నడిచి సంతాపం ప్రకటించుకుంటారు. మాథం పతిస్తారు. హిందూ ముస్లింలు సమైక్యంగా నిర్వహించుకునే పండుగ మొహర్రం. మండలంలోని క్రోసూరు, హసనాబాద్ తదితర గ్రామాల్లో మొహర్రం ఘనంగా నిర్వహించారు. దొడ్లేరులో జరిగిన మొహర్రం వేడుకలకు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ హాజరై ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

వర్గీకరణకు అలుపెరగని పోరాటం చేసిన మందకృష్ణ

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గరికపాటి రవికుమార్ మాదిగ



మాట్లాడుతున్న గరికపాటి రవికుమార్ మాదిగ

సత్తెనపల్లి: మాదిగ వర్గీకరణ సాధన కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అలుపెరగని పోరాటం చేశాడని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గరికపాటి రవికుమార్ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని సత్తెనపల్లిలోని అమరావతి బస్టాప్ సెంటర్‌లో సోమవారం ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గరికపాటి రవికుమార్ మాదిగ మాట్లాడుతూ వర్గీకరణ సాధన కోసం కృష్ణ మాదిగ అనేక పోరాటాలు చేసి సాధించాడన్నారు. ఈ సందర్భంగా ఆయన పోరాట పటిమను కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ నాయకులు గన్నెపూడి సాల్మన్ రాజ్, అమరావతి ఆటో స్టాండ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ అడుగుజాడల్లో నడవాలి

పెదకూరపాడు: అలుపెరగని పోరాటం చేసి మాదిగ జాతికి వంద సంవత్సరాల భవిష్యత్తు అందించిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ అడుగుజాడల్లో యువత పయనించి రాజ్యాధికారం కోసం పోరాటం చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ పల్నాడు జిల్లా కోశాధికారి కంచర్ల జాన్ బాబు మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మహాజన సోషలిస్టు పార్టీ పెదకూరపాడు నియోజకవర్గ అధ్యక్షుడు వేమవరపు జీవన్ మాదిగ ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జీవన్ మాట్లాడుతూ వర్గీకరణ సాధించిన ఫలాలను జాతి అందుకోవాలంటే ప్రతి ఒక్కరూ విద్యావంతులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో బంకా రాజారావు మాదిగ, కంచర్ల సుబ్బారావు మాదిగ, రావెల పవన్ మాదిగ, కంచర్ల వినయ్ జస్వంత్ మాదిగ, తాళ్లూరి చింతయ్య మాదిగ, తాళ్లూరి చక్రవర్తి మాదిగ, కంచర్ల థామస్ మాదిగ, మేకల నరేష్ మాదిగ, ఇనుముక్కల దావీదు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి యువకుడు బలవన్మరణం



చుక్కా సన్నీ

సత్తెనపల్లి: నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో కుటుంబానికి ఆసరాగా నిలవాల్సిన 22 ఏళ్ల యువకుడు బలవన్మరణం చెందడం సత్తెనపల్లి మండలం గుడిపూడి రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గుడిపూడి గ్రామానికి చెందిన చుక్కా థామస్, అనిత దంపతుల ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. కుమార్తెకు వివాహం అయ్యింది. కుమారుడు చుక్కా సన్నీ (22) డిగ్రీ డిస్‌కంటిన్యూ చేసి బెంగళూరులో చిన్న ఉద్యోగంలో చేరాడు. తండ్రి థామస్ సెంట్రింగ్ పని చేస్తుండగా, తల్లి అనిత కూలి పనులకు వెళుతుంది. తల్లి అనితకు చెవి నొప్పి ఉండడంతో ఆమెకు సోమవారం ఆపరేషన్ చేయాల్సి ఉంది. దీనికోసం బెంగళూరు నుంచి సన్నీ గుడిపూడి వచ్చాడు. ఆదివారం రాత్రి 9:30 గంటల సమయంలో గుడిపూడి సమీపంలో రైల్వేస్టేషన్‌కు కూత వేటు దూరంలో చెన్నై సూపర్ ఫాస్ట్ రైలు కిందపడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. సన్నీ మృతదేహం చెల్లాచెదురుగా పడిపోవడంతో రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. సోమవారం పోస్టుమార్టం పూర్తి చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి ఏరియా వైద్యశాలకు చేరుకొని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ వర్తింపజేయాలి

రైతు సంఘం నేతలు



తహసీల్దార్ ధనలక్ష్మికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

పెదకూరపాడు: అర్హత కలిగిన కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపజేయాలని పెదకూరపాడు అభివృద్ధి వేదిక (పీడీఎఫ్), రైతు సంఘం ఆధ్వర్యంలో పెదకూరపాడు తహసీల్దార్ ధనలక్ష్మికి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఆయా సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ ఓసీలోని కౌలు రైతులకు కూడా వర్తింపజేయాలన్నారు. గత ప్రభుత్వం కౌలు రైతులను కులాల వారీగా విభజించి ఓసీలకు ఇవ్వకపోవడం వల్ల అన్యాయం జరిగిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వెంటనే విధి విధానాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కులాలకతీతంగా కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం నగదును కౌలు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ ధనలక్ష్మి మాట్లాడుతూ ఉన్నతాధికారులకు ఈ విషయం తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు దర్శి శేషారావు, ఎం.మస్తాన్‌రావు, కె.జాన్ బాబు, కె.చిన్నా, కె.సుబ్బారావు, షేక్ జానీ, కె.వీరయ్య, వి.జీవన్, ఆర్.దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

గన్నెపూడిలో సమస్యలు పై టీడీపీ యాప్‌లో నమోదు



సత్తెనపల్లి: కూటమి పాలన ఏడాది పూర్తయిన సందర్భంగా మండలంలోని గన్నెపూడి గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో సోమవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పర్యటించారు. సమస్యలు తెలుసుకొని, వాటిని పై టీడీపీ యాప్‌లో నమోదు చేసి వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ రానున్న 4 సంవత్సరాల్లో మరిన్ని నిధులు తీసుకువచ్చి సత్తెనపల్లిని అభివృద్ధి పథంలో నిలపడమే లక్ష్యంగా పని చేస్తానన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని త్వరలోనే కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. తాతపూడి రకం మామిడి కాయలను గ్రామ ప్రజలకు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. ముందుగా ఎన్టీఆర్, డాక్టర్ కోడెల శివప్రసాదరావుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మక్కపాటి రామచంద్రరావు, నాయకులు ఉన్నారు.

పేదల గుండెల్లో మారాజు

- సత్తెనపల్లి నియోజకవర్గంలో 2004-2009 మధ్య రూ.500 కోట్ల పైగా అభివృద్ధి
- నేడు వాడవాడలా వైఎస్సార్ జయంతి



రూ.20 కోట్లతో పట్టణ ప్రజలకు తాగునీటిని అందించేందుకు నిర్మించిన మంచినీటి చెరువు

సత్తెనపల్లి: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలన సత్తెనపల్లి నియోజకవర్గ ప్రజానీకానికి స్వర్ణయుగం. ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి 2003 ఏప్రిల్ 9న ప్రజాప్రస్థానం పాదయాత్ర చేపట్టారు. సత్తెనపల్లి నియోజకవర్గ రైతాంగానికి మహానేత ఎంతగానో అండగా ఉన్నారు. నియోజకవర్గంలో 43,202 మంది రైతులకు రూ.93.18 కోట్లు రుణమాఫీ చేశారు. బ్యాంకులకు సకాలంలో రుణాలు చెల్లించిన రైతులకు ప్రోత్సాహకంగా రూ.5 వేలు చొప్పున 14,574 మంది రైతులకు రూ.9.50 కోట్లు చెల్లించారు.

రూ.500 కోట్ల పైనే అభివృద్ధి..

సంక్షేమం కొనసాగిస్తూనే సత్తెనపల్లి నియోజకవర్గంలో రూ.500 కోట్ల పైగా నిధులతో అభివృద్ధి చేశారు. గుంటూరు, ప్రకాశం జిల్లాలకు నిత్యం వెలుగులు ప్రసాదించేలా రూ.120 కోట్ల అంచనా వ్యయంతో 400 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేశారు. ఎన్నాదేవి వద్ద నిర్మాణం పూర్తి చేసుకొని ప్రస్తుతం వాడుకలో ఉంది. పట్టణ ప్రజల తాగునీటి సమస్య పరిష్కరించేందుకు యూఐడీఎస్ఎస్ఎంటీ పథకం ద్వారా రక్షిత మంచి నీటిని అందించేందుకు రూ.23 కోట్లతో లక్కరాజుగార్లపాడు రోడ్‌లో చెరువు నిర్మాణం, ఐడీఎస్ఎంటీ కింద రూ.42 లక్షలతో రాజీవ్‌గాంధీ కూరగాయల మార్కెట్, రూ.82.39 లక్షలతో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్... ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారు. ఇందిరా క్రాంతి పథకం కింద స్వయం సహాయక సంఘాలకు చెందిన 8,975 గ్రూపులకు రూ.54,16,13,000 పావలా వడ్డీ కింద రుణాలు అందించి సంక్షేమానికి చిరునామాగా వైఎస్సార్ జీవితం చిరస్థాయిగా నిలుస్తోంది.

నియోజకవర్గంలో ఇలా...

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు మంగళవారం నియోజకవర్గంలో వాడవాడలా నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి సోమవారం తెలిపారు.

- మంగళవారం ఉదయం 9:00 గంటలకు ముప్పాళ్ళ మండలం చాగంటివారిపాలెం గ్రామంలో వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తామన్నారు.
- 9:15 గంటలకు సత్తెనపల్లి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో కేక్ కట్ చేసి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించటం, అనంతరం రక్తదాన శిబిరం జరుగుతుందన్నారు.
- 9:30 గంటలకు పట్టణంలోని 13వ వార్డులో, 9:40 గంటలకు గ్రంథాలయం వద్ద, 9:50 గంటలకు తాలూకా సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించటం జరుగుతుందన్నారు.
- 10:00 గంటలకు సత్తెనపల్లి ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ, 10:10 గంటలకు 16వ వార్డులో, 10:20 గంటలకు 19వ వార్డులో, 10:30 గంటలకు అచ్చంపేట రోడ్డులోని రైల్వేగేట్ వద్ద వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించటం, 11:00 గంటలకు పట్టణంలోని ఆదరణ వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి అనంతరం అన్నసంతర్పణ, 11:30 గంటలకు మొల్లమాంబ వృద్ధాశ్రమంలో కేక్ కటింగ్, అన్నసంతర్పణ, 12:00 గంటలకు పరివర్తన ఆశ్రమ పాఠశాలలో కేక్ కటింగ్, అన్నసంతర్పణ జరుగుతాయన్నారు.
- 12:30 గంటలకు రాజుపాలెం మండలం పెదనెమలిపురిలో, 12:45 గంటలకు కొండమోడు గ్రామం మెయిన్ రోడ్డు సెంటర్లో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు, అన్నసంతర్పణ జరుగుతుందన్నారు.
- సాయంత్రం 6:00 గంటలకు నకరికల్లులో, 6:30 గంటలకు రాజుపాలెం మండలం బలిజేపల్లిలో, 7:30 గంటలకు సత్తెనపల్లి రూరల్ మండలం కంటెపూడిలో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు, అన్న సంతర్పణ జరుగుతాయన్నారు.
- రాత్రి 8:00 గంటలకు ముప్పాళ్ళ మండలం లంకెలకూరపాడులో కేక్ కట్ చేసి వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించటం జరుగుతుందన్నారు. వేడుకలకు నియోజకవర్గంలోని రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండల, గ్రామ, వార్డు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అనుబంధ విభాగాల బాధ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు మహానేత జయంతి వేడుకలు

అచ్చంపేట: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు స్థానిక వైఎస్సార్ కాంస్య విగ్రహం వద్ద మంగళవారం ఉదయం 10 గంటలకు జరుగుతాయని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ పతాకావిష్కరణ, మహానేతకు నివాళులు, మహానేత జ్ఞాపకాలు, అనుబంధాలు, వారు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై ప్రముఖుల ప్రసంగాలు ఉంటాయన్నారు. మండలం నలుమూలల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు తరలిరావలసినదిగా చంద్రయ్య పిలుపునిచ్చారు.

వైఎస్సార్ జయంతి వేడుకలలో పాల్గొనండి

అమరావతి: మండల కేంద్రమైన అమరావతిలో నిర్వహించే మహానేత వైఎస్సార్ జయంతి వేడుకలలో మండల పరిధిలోని అన్ని గ్రామాల పార్టీ కార్యకర్తలు, నాయకులు, వైఎస్సార్ అభిమానులు పాల్గొనాలని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మంగళవారం ఉదయం 9 గంటలకు స్థానిక కచేరి సెంటర్‌లోని మహానేత రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద నిర్వహించే జయంతి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

క్రోసూరులో...

క్రోసూరు: వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో మంగళవారం రైతు బాంధవుడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు మండల వైఎస్సార్సీపీఅధ్యక్షుడు వెలది అప్పారావు సోమవారం తెలిపారు. క్రోసూరులోని నాలుగు రోడ్ల సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద ఉదయం 10 గంటలకు వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు తప్పక హాజరుకావాలని కోరారు.

రాజుపాలెంలో...

రాజుపాలెం: మండలంలోని అన్ని గ్రామాలలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు నేడు ఘనంగా జరుపుకోవాలని మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి సమన్వయకర్త గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి పాల్గొంటారని కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ముప్పాళ్లలో...

ముప్పాళ్ల: మండల పరిధిలోని చాగంటివారిపాలెం గ్రామంలో తహసీల్దారు కార్యాలయం వద్ద గల దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు జరుగుతాయని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి హాజరవుతున్నారని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రాజన్న జ్ఞాపకాలతో...

- మహానేత హయాంలో అభివృద్ధి పథంలో పెదకూరపాడు నియోజకవర్గం
- 2008లో 10 ఎత్తిపోతల పథకాల నిర్మాణానికి శిలాఫలకాల ఆవిష్కరణ
- అచ్చంపేట, బెల్లంకొండల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, క్రోసూరులో పాలిటెక్నిక్ కళాశాల మంజూరు



డాక్టర్ వైఎస్సార్ మంజూరు చేసిన అచ్చంపేట ప్రభుత్వ జూనియర్ కళశాల

అచ్చంపేట: మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో పెదకూరపాడు నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందింది. 2004లో పులిచింతల ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. 2008లో రైతులు ఏడాదిలో రెండు పంటలు పండించుకునేలా కృష్ణానది తీరాలలో ఒకే సారి 10 ఎత్తిపోతల పథకాలకు శిలాఫలకాలు ఆవిష్కరించారు. అచ్చంపేట మండలంలోని 14 గ్రామాల దాహార్తిని తీర్చేందుకు 2008లో పుట్లగూడెం వద్ద రక్షిత మంచినీటి పథకానికి అంకురార్పణ చేశారు.

2019లో మహానేత ఆశయం నెరవేరింది

పులిచింతల ప్రాజెక్టు నిర్మాణానికి అంకురార్పణ చేసిన మహానేత ప్రజల నుంచి దూరమైనా ఆయన ఆశయాలు, లక్ష్యాలు ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో నెరవేరాయి. 2019లో వైఎస్సార్ తనయుడు జగన్ సీఎం అయిన తరువాత ఐదేళ్లు నిండుకుండను తలపించేలా 45 టీఎంసీల నీటితో ప్రాజెక్టులో కృష్ణాజలాలు కళకళలాడాయి.

అచ్చంపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల

మహానేతో 2008, జూన్ 5న పులిచింతల ప్రాజెక్టు వద్ద నిర్వహించిన రైతు సదస్సులో పాల్గొనేందుకు అచ్చంపేట మండలానికి వచ్చారు. ఇక్కడి ప్రజలు, నాయకులు, విద్యార్థులు అచ్చంపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల కావాలని అడిగారు. అవసరాన్ని, ఆవశ్యకతను గుర్తించిన మహానేత వెంటనే అక్కడికక్కడే మంజూరు చేశారు. 2008, జూన్ 5న కళాశాల మంజూరైతే జూన్ 12 నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం తరగతులను 18 మంది విద్యార్థులతో జెడ్పీ హైస్కూలు అదనపు తరగతి గదులలో ప్రారంభించారు. ఆ తరువాత కళాశాలకు పక్కా భవనాన్ని నిర్మించారు. ఇప్పుడు ఆ కళాశాలలో 250 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు.

పాలిటెక్నిక్, జూనియర్ కళాశాల మంజూరు

మహానేత హయాంలో క్రోసూరు మండలంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను మంజూరు చేశారు. ఎంతో మంది విద్యార్థులు ఈ కళాశాల ద్వారా విద్య అభ్యసిస్తున్నారు. 2021లో రూ.7 కోట్లతో నిర్మించిన పాలిటెక్నిక్ కళాశాల భవనాన్ని సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. బెల్లంకొండలోను మహానేత ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంజూరు చేయడంతో అందులో ఎంతో మంది నిరుపేద విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

10 ఎత్తిపోతల పథకాలకు శంకుస్థాపన

పెదకూరపాడు నియోజకవర్గంలో చివరి భూములకు నాగార్జున సాగర్ ప్రాజెక్టునుంచి సాగునీరు అందే పరిస్థితులు లేవు. రైతుల కష్టాలను తెలుసుకున్న వైఎస్సార్ 2008, జూన్ 5న రూ.250 కోట్ల అంచనా వ్యయంతో ఒకేసారి 10 ఎత్తిపోతల పథకాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇప్పుడు ఆ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా పెదకూరపాడు, అచ్చంపేట, అమరావతి, క్రోసూరు మండలాలకు సమృద్ధిగా సాగునీరు అందుతుంది.